కానీ దాని మూలంగా తనలో చల్లారిపోతుందనుకున్న అవమానం సవాల్ చేస్తున్న మహతి రూపంలో రెట్టింపయి పోయి, తనని మరీ బాధ పెడుతోంది. వ్యక్తిని బట్టి, గెల్చుకోవాల్సిన విజయం మారిపోతుందా? అంత జరిగినా, ఆమెకు చీమ కుట్టినట్లయినా లేకపోగా, సవాల్ చేస్తోంది. తన అభిజాత్యాన్ని కించపరుస్తోంది. ఆమెని గెలవాలి. గెలిచి తీరాలి, అప్పుడు గాని తనలోని అవమానం చల్లారదు. అంటే -- ఆమె చేసేది ఏ చాలెంజ్ అయినా దానికి తను ఇప్పటికిప్పుడే సిద్ధపడి, ఆమెను బరిలోకి దింపి తీరాలి.

"కమాన్ టెల్‌మీ. నా జీవితాన్ని ఫణంగా పెట్టయినా నిన్ను గెలిచి తీరతాను. ఓటమి వెనకడుగు నాకు తెలీవు. చెప్పు" అరుస్తున్నట్లుగా ఆయాసపడిపోతూ అన్నాడు మధుకర్ .

"నువ్వు పూర్తిగా బయటకు వచ్చినట్టు నాకు నమ్మకం కలగాలి. తీరా ఇంటికి వెళ్ళాక- మా అమ్మను ఒదిలి ఉండలేను. మా నాన్న గారిని దూరం చేసుకోలేను అనే సెంటిమెంట్స్‌ని అడ్డం పెట్టుకోకూడదు.

తల్లిదండ్రుల అపార సంపదను, తద్వారా లభించే సుఖాల్ని, సౌఖ్యాల్ని, సోషల్ స్టేటస్‌ని, లగ్జరీస్‌ని ఒదులుకోలేనని చాలెంజ్ నుంచి వెనక్కి మరలే అర్భకుడివై పోకూడదు. నీలోని ఆత్మాభిమానాన్ని, పౌరుషాన్ని, పట్టుదలను, అభిజాత్యాన్ని నిరూపించుకుంటూ, కట్టుబట్టలతో బయటకు వచ్చి, నీ కాళ్ళమీద నీవు నిలబడగలగాలి. అప్పుడు మాత్రమే నేను- నీ మగతనాన్ని, పురుషత్వాన్ని, వాటిని ఆవరించుకొని ఉండే ఇగోని గౌరవిస్తాను" స్థిరంగా అంది మహతి.

అలాంటి చాలెంజ్‌ని ఏ  మాత్రం మహతి నుంచి ఊహించని మధుకర్, నిశ్శబ్ద శూన్యంలో మిగిలిపోయాడు కొద్ది క్షణాలు. మగతనానికి, పురుషత్వానికి కొత్త భాష్యం? అయినా ఒకింతసేపటికి తేరుకున్నాడు మధుకర్.

"ఓ.కే. నీ దృష్టిలో మగతనమంటే ఎవరి కాళ్ళమీద వాళ్ళు నిలబడగలగటమే అయితే, నే నదే చేసి నా మగతనాన్ని నువ్వు గౌరవించేలా చేసుకుంటాను. కట్టుబట్టలతో ఏ క్షణాన నేను బయటకు రాబోయేది ఇరవై నాలుగ్గంటల్లో నీకు ఫోన్‌చేసి చెబుతాను."అవేశంగా, ఉక్రోషంగా అంటూ గబగబా అడుగులేసుకుంటూ ఆ

గదిలోంచి బయటకు దూసుకుపోయాడు. మహతి పెదవుల మాటునుంచి ఓ విచిత్రమైన నవ్వు.....ఆ నవ్వును గమనించే అవకాశం మధుకర్‌కి లేదు.

*                *                *                *

గబగబా పెద్ద అడుగుల్తో వస్తున్న మధుకర్‌ని చూసి-

"అయిపోయిందా కార్యక్రమం" నిషాగా అడిగాడు సురేష్.

కార్‌డోర్ తీసి స్టీరింగ్‌ముందు కూర్చుంటూ "ఎక్కండ్రా" అన్నాడు మధుకర్ సీరియస్‌గా.

"అసలేమయింది" మళ్ళీ అడిగాడు సురేష్.

"డోన్టాక్ ట్రాష్. గెటిన్ ఐసే" ఇగ్నీషన్‌కీ తిప్పుతూ అన్నాడు మధుకర్.

ఏమైవుంటుంది మూర్తి రకరకాలుగా ఆలోచిస్తున్నాడు.

మాట్లాడకుండా అందరూ కారెక్కారు.

*                *                *                *

స్ప్రింగ్‌లా లేచిన మహతి, పీలిక పీలికలైన పోయిన నైట్‌గౌనుని తీసి, పక్కన పడేసి బీరువాలోంచి కొత్త నైట్‌గౌనుని వేసుకుని- గబగబా బుక్‌షెల్ఫ్ దగ్గరకెళ్ళింది. అక్కడ- రహస్యంగా అమర్చిన కెమెరాను ఆఫ్ చేసింది.  అది ఆల్ట్రావయొలెట్ ప్రోగ్రామింగ్ కెమెరా- మధుకర్ ఆ గది లోకి రావడం, గది తలుపు టక్‌మని మూసుకోవడంతో, అది పనిచేయడం ప్రారంభించింది. ప్రతి ఒక నిమిషానికి ఒక ఫోటో తీస్తుందది డైరెక్ట్ పాజిటివ్ ప్రింటింగ్- మహతి వాటిని పరిశీలనగా చూసింది. ఆ గదిలో మధుకర్ ప్రతిచర్యనూ అది ఫోటో తీసింది.

దాదాపు ముప్పైఫోటోలు. నగ్నంగా, అర్ధనగ్నంగా ఫోటోల్లో కన్పిస్తున్న మధుకర్, తన నగ్న శరీరాల్ని చూడగానే సిగ్గుపడింది. తన నగ్న దేహంలో, ఆ సమయంలో తనభావాలు స్పష్టంగా కనబడడంతో ఆలోచనలో పడింది మహతి. వెంటనే ఫోన్‌వేపు నడిచింది.

అప్పటికి టైమ్ 11.25 అయింది. ఒక నెంబర్ తిప్పింది. అవతలినుంచి లేడీవాయిస్- "ఏంటి మహీ. ఇంత రాత్రప్పుడు ఫోన్‌చేశావ్?" డాక్టరు హేమలత గొంతు.

హేమలత మహతి ఫ్రెండ్.

"కార్యక్రమం పూర్తయి ఇరవై నిమిషాలయింది" చెప్పింది మహతి.

"ఆఖరికి నువ్వనుకున్నట్టే చేశావన్నమాట" హేమలతగొంతులో ఏదో బాధ.

"తప్పదు హేమా. నా గురించి నీకు తెలుసు కదా, నువ్వన్నట్టు నాకు గర్భం వస్తుందా?" సీరియస్‌గా అడిగింది మహతి.

"ఇప్పుడప్పుడే ఏం చెప్పలేం, రేపోసారి నర్సింగ్‌హోంకి రా."

"ఓ.కే గుడ్‌నైట్ హేమా--"ఫోన్ పెట్టేసింది మహతి.

"ఇంత అర్థరాత్రప్పుడు ఏమిటా ఫోను? సీరియస్ కేసా" రిసీవర్ పెట్టేసి, బెడ్‌మీద కుర్చున్న భార్య హేమవేపు చూస్తూ అడిగాడు రవికిరణ్- రాఘవేంద్ర నాయుడు పి.ఏ."సీరియస్ కేసో సిల్లీ కేసో ..... నాకేం అర్థంకావడం లేదు" ఆలోచిస్తూ బెడ్‌లైట్ ఆర్పింది హేమ.

* * * *

"వాట్ ..... డాడ్, పిల్చారా" అంటూ వచ్చాడు మధుకర్ .

రాఘవేంద్ర నాయుడు సోఫాలో కూర్చున్నాడు. ఆయనకు కొంచెం దూరంలో భువనేశ్వరీదేవి కూర్చుంది.

"కూర్చో" చేతిలోని ఫైలుని పక్కన పడేస్తూ భార్యవైపు అర్థవంతంగా చూశాడు నాయుడు.

"పిలిచింది నేనే అయినా చెప్పాల్సింది మీ మమ్మీ. చెప్పు భువనా" అన్నాడు రాఘవేంద్ర నాయుడు .

“బాగానే వుంది ..... మీ యిద్దరిమధ్యా నన్ను ఇరికిస్తున్నారా?” అని నవ్వుతూ-

“చూడు మధూ, మీ డాడీ నీకొక్కొన్ని సంబంధాలు చూశారు. వాటిలో నీకిష్టమైన సంబంధం నువ్వుచెప్తే మిగతా విషయాలు డాడీ చూసుకుంటారు.”

ఏ ఉపోద్ఘాతమూ లేకుండా చెప్పింది భువనేశ్వరీ.

“ఆ ట్వంటీ ఫైవ్ లాక్స్ కాంపెన్సేషన్‌తో ముడివేసింది ఇదేనా” రాఘవేంద్ర నాయుడు  వేపు చూసి అన్నాడు  మధుకర్ - ఒకింత విస్మయంగా.

“యాజ్ యూ లైక్ డాడ్. అంతే కదా మమ్మీ.”

కొడుకు ఆ విషయాన్ని అంతత్వరగా తేల్చేస్తాడని అనుకోలేదు రాఘవేంద్ర నాయుడు, భువనేశ్వరి. దానిక్కారణం ఎంతోమంది అమ్మాయిల్తో మధుకర్ తిరుగుతున్నాడని తెల్సిన ఇన్ఫర్‌మేషనే! వాళ్ళల్లో ఏ ఒక్కరినైనా బహుశా ప్రేమిస్తూ వుండొచ్చని, అక్కడే కొడుక్కి, తండ్రికి గొడవ మొదలౌతుందని అనుకుంది భువనేశ్వరి. బహిరంగంగా నలుగురి నోట్లో పడ్డ మహతి విషయంలో కూడా కొడుక్కి సాఫ్ట్ కార్నర్ లేకపోవడం పట్ల ఆనందించాడు రాఘవేంద్ర నాయుడు .

ఆడపిల్లల్తో  ఎటాచ్‌మెంట్ తను సహించలేడు.

‘డిటాచ్‌మెంటే’ బిజినెస్‌కి  మూలం. ఆడపిల్లలేకాదు, ఎవరితోనైనా సరే! అవసరం వుంటే అందలం ఎక్కించుకో. లేకపోతే పట్టించుకోకు. కానీ ఆ విషయం అవతలివాడికి తెలియకుండా జాగ్రత్తపడు.

“కానీ ఒక్కఏడాది మీరు వెయిట్ చెయ్యాలి” సడన్‌గా  కొడుకు గొంతులోంచి వచ్చిన ఆ మాటకు ఉలిక్కిపడుతూ చూశాడు రాఘవేంద్ర నాయుడు కొడుకువైపు.

“ఆ కండిషన్ ఏమిట్రా ..... ” కంగారుగా అంది భువనేశ్వరి.

“డాడీ, ఈ కోట్ల ఆస్తి ఎలా సంపాదించారు మీరు” సూటిగా తండ్రివేపు చూస్తూ ప్రశ్నించాడు మధుకర్ .

కావలసింది అడగడం, ఖర్చు పెట్టడం తప్పించి ఇలాంటి ప్రశ్నలెప్పుడూ వెయ్యలేదు కొడుకు.

“ఈ సిల్లీ క్వశ్చన్ ఏమిట్రా”

“దిసీజ్ లుక్ లై కే సిల్లీ క్వశ్చన్ బట్ నాట్ దిసీజ్ ఎ సిల్లీ క్వశ్చన్. డెడ్‌లీ సీరియస్. డాడ్ ఐ వాంట్ ఆన్సర్” కొడుకులోని సీరియస్ నెస్‌ని గమనించాడు.

“బిజినెస్ చేసి ..... ”

“ఆ బిజినెస్ ఎవరి ద్వారా చేశారు? ఎవరి సహాయమైనా తీసుకున్నారా లేక మీ ఇంటెలిజెన్స్‌తోనే చేశారా?”

“పూర్తిగా నా తెలివితేటలతో చేశాను. నేను బిజినెస్ చెయ్యాలని నిర్ణయించుకున్నప్పుడు మీ అమ్మ కూడా నన్ను వ్యతిరేకించింది. ఎందుకండీ శుభ్రంగా ఏ గవర్నమెంట్ ఆఫీసులోనైనా ఉద్యోగం చూసుకోండి, పెన్షన్లుంటాయి. గ్రాట్యుటీలుంటాయి. లేనిపోని రిస్క్ తీసుకోకండని హెచ్చరించింది. కానీ అదృష్టం వుంటేనే బిజినెస్ సక్సెస్ అవుతుందని చాలామంది అనుకుంటారు. కానీ అది రాంగ్ ఒపీనియన్. అదృష్టానికి, బిజినెస్‌కీ సంబంధం లేదు. [illegible] మన పాజిటివ్ ఎమోషన్స్ సక్రమ మార్గంలో పెట్టుకున్నప్పుడు ఎంతటి పనినైనా చెయ్యగలం. అదే నా ఆత్మవిశ్వాసం. అంటే అదృష్టం నీ ఒక్కడికి సంబంధించిన విషయం. బిజినెస్ లక్షమందిలో నీకున్న రిలేషన్‌షిప్‌కు సంబంధించిన విషయం, దాన్నే వ్యవహారజ్ఞానం అంటారు.

నువ్వు ఎదుటి వ్యక్తిని కోపగించుకున్నావనుకో వాడూ నిన్ను కోపగించుకుంటాడు. నువ్వు ఎదుటి వ్యక్తిని తిడితే వాడూ తిడతాడు. నమస్కరించావనుకో - వాడు నీకు నమస్కరిస్తాడు. నువ్వు చిరునవ్వు నవ్వితే వాడూ నవ్వుతాడు ..... అలాగే నువ్వు కష్టపడితే వాడూ కష్టపడతాడు. దిసీజ్ బిజినెస్ రిలేషన్. ఎదుటి వ్యక్తిని నువ్వెలా మలచుకోగలవు అన్న దాని మీదే నీ బిజినెస్

ఆధారపడి వుంటుంది.బేసిగ్గా ఆలోచిస్తే అదే నీ తెలివి తేటలక్కూడా నిదర్శనమౌతుంది. ఈ ఒక్క సూత్రాన్నే నేను నమ్మాను. నేను నమ్మిన నాడే నాకుతెల్సు. వెయ్యి రూపాయల పెట్టుబడితో ప్రారంభించిన నా వ్యాపారం, అతి సులభంగా కోటి రూపాయలకు వెళ్తుందని. ఇదంతా నీకెందుకు చెప్తున్నానంటే ఇలా నువ్వడగడం ఇదే మొదటి సారి కనుక- నీకు తెలియాలి గనుక చెప్తున్నాను."

"ఇప్పటికే చాలా ఆలస్యమైపోయింది. ఇట్స్ టూ లేట్ ..... ఐనా ఫర్వాలేదు. మీ తెలివితేటలతోనే, మీ బిజినెస్ ప్రారంభించారు. ఇంత ఎంపైర్ని క్రియేట్ చేసినప్పుడు, నేను కూడా మీలా ఎదగాలని మీకెప్పుడు అనిపించలేదా?"

ఆ ప్రశ్న వేసిన మధుకర్ లో, ఓ కొత్త మధుకర్ని చూస్తున్నారు ఆ తల్లిదండ్రులు.

"అంటే?" అర్థం కాలేదు రాఘవేంద్ర నాయుడుకి.

"అందులో అర్థం కానిదేదీ లేదు ..... ఐ వాంట్ టు బీ ఎ సెల్ఫ్ మేడ్ మాన్. అంతే ..... రాఘవేంద్ర నాయుడు కొడుగ్గా నేను గుర్తింపు కోరుకోడం లేదు."

"ఇదెప్పట్నించి?" టెస్ట్ చెయ్యడం ఆయనకు అలవాటు. ఆ మాటలో వేళాకోళం ధ్వనించేసరికి మధుకర్కి ఒకింత కోపం వచ్చింది.

"ఇప్పట్నించే -ఎస్ డాడ్ -టుడే ఆన్వార్డ్స్- నాకాళ్ళమీద నేను నిలబడతాను. కట్టుబట్టల్తో నడిరోడ్డుమీదకెళ్ళిపోడానికి నిర్ణయించుకున్నాను" స్థిరంగా చెప్పాడు మధుకర్.

"ఇదేం నిర్ణయంరా! ఒక్కగానొక్క కొడుకువి-"

ఏదో అనబోతున్న భార్య భువనేశ్వరి దేవిని కళ్ళతోనే వారించాడు రాఘవేంద్ర నాయుడు.

ఒక వ్యక్తి ఒక వ్యక్తిలాగే ఎప్పుడూ ఉండిపోడు. రోడ్డుమీద వెళ్తూ, రోడ్డు తప్ప మరేమీలేదని బాధపడే బెగ్గర్కైనా, ఒక టర్నింగ్ పాయింట్ వస్తుంది. జీవితంలో

క్రాస్ రోడ్స్ వస్తాయి. ఆ క్రాస్ రోడ్స్ దగ్గర మనిషి నిలబడే క్షణం వచ్చినపుడు, ఒక్క నిమిషం, ఒకే ఒక్క నిమిషం ఆలోచించగలగాలి.

ప్రతీది సులభమ్ముగా సాధ్యపడదు లెమ్మ ..... నరుడు నరుడౌట దుష్కరమ్మ సుమ్మ- అని గాలీబ్ ఉత్తినే అనలేదు. గాలీబ్ మాట గాలిమాట కాదు.

ఆ మహతి లాంటి వాళ్ళకు దూరంగా ఉండు- ఉంటేనే కోటీశ్వరుడి కొడుగ్గా, కోటీశ్వరుడి అల్లుడిగా నువ్వు నిలబడగలవు- అని హెచ్చరించటానికి పిలిపించిన కొడుకులో, అంతలోనే ఎంత మార్పు?!

ఏ మార్పయితే మధుకర్‌లో రావాలని, కావాలని కోరుకున్నాడో, ఆ మార్పు ఇంత త్వరలో వస్తుందని అనుకోలేదు.

"ఇంత త్వరగా నిప్పులాంటి నిర్ణయం తీసుకోవటం వెనక గల కారణం తెలుసుకొవచ్చా? నీ కభ్యంతరం లేకపోతే చెప్పు" తనూహించిన కారణం, తన కొడుకు చెప్పబోయే కారణం ఒకటే అయితే ..... ప్రపంచంలోకి ఒంటరిగా వెళ్తున్న మధు అసాధ్యాల్ని, సుసాధ్యాలుగా చేయగలడన్న నమ్మకం తనకు కలుగుతుంది.

మధుకర్ ఒకసారి తల్లీ, తండ్రి మొఖాలవేపు చూశాడు.

"ఏకైక కారణం నా ఆత్మాభిమానం దెబ్బ తినటం- మగతనానికి అసలైన అర్థం స్వయంకృషి అని తెలీటం."

"ఎవరిద్వారా తెలిసింది? ఏవరు తెలియజెప్పారో?"

"మహతి ..... " ఒత్తి పలుకుతూ అన్నాడు మధుకర్ .

"ఎవరా మహతి? ..... "

"మీ ఇద్దరి మధ్యా చాలెంజా?" నాయుడు తిరిగి అడిగాడు.

"ఒక రకంగా అలాంటిదే-" అంటూనే మధుకర్ ఫోన్‌వేపు నడిచాడు.

“చాలెంజ్ అన్నది- మీ వయస్సులో అయితే ఉక్రోషం, కసి, కోపం నుంచి పుట్టుకొస్తాయి. మా వయస్సులో అయితే అస్థిత్వం కోసం జరిగే పోరాటంలోంచి, సంయమనంలోంచి పుట్టుకొస్తుంది. చాలెంజ్ బాగానే ఉంటుంది కాని దాని ఎదుర్కొనే సందర్భంలో చాలా సమస్యలు, కష్టాలు, కన్నీళ్ళు ఎదురొస్తాయి. వాటన్నింటిని చిరునవ్వుతో భరించగలిగినప్పుడే నీ చాలెంజ్ నిలబడుతుంది. నిలబడగలవా?” రాఘవేంద్ర నాయుడు కావాలనే అలా మాట్లాడాడు.

తండ్రి వేపోసారి ఒకింత సీరియస్‌గా చూసిన మధుకర్ చటుక్కున ఫోనందుకొని ఒక నెంబర్ డయిల్ చేశాడు.

వెంటనే మహతి లైన్లోకి వచ్చింది.

“హలో ..... మధుకర్ దిస్ సైడ్. ఐయామ్ రెడీ” అని అంటూ తండ్రి వేపు అదే తన సమాధానమన్నట్లు చూశాడు.

రాఘవేంద్ర నాయుడు మీసాలచాటున గర్వం ..... భువనేశ్వరీ దేవి కళ్ళలో భయం ..... “మగతనమంటే ఇది- రాత్రి చేసింది కాదు--” అంది ఫోన్‌కి ఆవలి వేపునున్న మహతి.

మధుకర్ ఫోన్ పెట్టేశాడు.

అప్పటికే రాఘవేంద్ర నాయుడు ఒక నిర్ణయానికొచ్చాడు. ఉన్న ఒక్క కొడుకును వదిలి ఉండలేని పితృ వాత్సల్యం, మమకారం, ప్రేమ, కొడుకులో చూసుకుంటున్న కన్న తండ్రి ..... సైకలాజికల్ డంకర్స్ నుంచి తప్పుకోలేక పోయాడు.

కొడుకు తనకు కలిగించిన నష్టాల్ని లాభాలుగా మార్చగలిగినప్పుడు ఒకింత ఫీలయ్యాడంతే - కొడుకు దారి తప్పిపోతున్నాడే అని, దారి తప్పిన తన కనుసన్నలనుంచి, సాన్నిహిత్యం నుంచి దూరం కాలేదుగా అని ఆనందించాడు.

బట్ ..... బట్ ..... ఇప్పుడు ..... తన సర్వస్వమే తననుంచి దూరమై పోతానంటుంటే తట్టుకోలేకపోతున్నాడు.

ఎన్నేళ్ళగానో అనుభవాల ఒరిపిడినుంచి ప్రోది చేసుకుంటూ వస్తున్న సంయమనం, గంభీరత, మంచికి-చెడుకి, లాభాలకు- నష్టాలకు చలించని ధీరత్వం క్రమంగా కళ్ళముందే చేతి వేళ్ళ మధ్యనుంచి జారిపోయే ఇసుకలా అయ్యేసరికి కదిలిపోయాడు.

"నీ నిర్ణయాన్ని నేను కాదనలేను- బట్ ..... కనీసం ఒక్క ఇరవై నాలుగు గంటలు కలిసి నీతో గడపాలని ఒక తండ్రి ఒక కొడుకుని కోరుకోవటంలో తప్పులేదనుకుంటాను."

భర్త కంఠంలో అస్పష్టంగా తొంగిచూసిన వ్యధకు భువనేశ్వరీ దేవి కదిలిపోయింది.

మధుకర్ ఒకింత బాధపడ్డాడు.

తండ్రి ఆవేదనని అర్థం చేసుకోగలిగాడు.

అందుకే తండ్రి అభ్యర్థనని కాదనలేకపోయాడు మధుకర్.

*　　　　*　　　　*　　　　*